సాక్షి
విశాఖపట్నం
శనివారం । 30 । ఆగస్టు । 2025



రేంజ్ పరిధిలో 12 మంది సీఐల బదిలీ 8లో



వారు మరణించి.. కొందరికి వెలుగునిచ్చి 8లో



పలు రైళ్ల రద్దు, మరికొన్ని రీ షెడ్యూల్ 8లో

న్యూస్‌రీల్

ఎన్టీపీసీ సీఎండీకి ఎక్స్‌లెన్స్ అవార్డు



ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకుంటున్న ఎన్టీపీసీ సీఎండీ గుర్దీప్ సింగ్

పరవాడ: స్థిరమైన విద్యుత్ ఉత్పత్తిలో **ఎన్టీపీసీని** అగ్రగామిగా నిలపడంలో విశేష కృషి జరిపిన ఎన్టీపీసీ సీఎండీ గుర్దీప్ సింగ్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం జరిగిన స్కోప్ ఎమినెన్స్ ఆవార్డుల కార్యక్రమంలో ఎన్టీపీసీ సీఎండీ గుర్దీప్ సింగ్‌కు వ్యక్తిగత నాయకత్వ ఎక్స్‌లెన్స్ అవార్డును భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. ఎన్టీపీసీ ఇంధన పరివర్తనను నడిపించడంలోను.. దాని క్లీన్ ఎనర్జీ పోర్ట్‌పోలియోను బలోపేతం చేయడంలోను.. స్థిరమైన విద్యుదుత్పత్తిలో కంపెనీని అగ్రగామిగా నిలబెట్టడడంలో గుర్దీప్ సింగ్ చేసిన కృషికి ఈ గుర్తింపు లభించింది.

పర్యవేక్షకులుగా ఏడుగురికి పదోన్నతి



పర్యవేక్షకులుగా పదోన్నతి పొందిన సీనియర్ అసిస్టెంట్స్

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సీనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న ఏడుగురు జీవీఎంసీ పర్యవేక్షకులుగా పదోన్నతి పొందారు. ఈ మేరకు శుక్రవారం వారికి పదోన్నతి పత్రాలు జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అప్పలనాయుడుతో కలిసి మేయర్ పీలా శ్రీనివాసరావు అందజేశారు.

రెండో రోజూ కొనసాగిన డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఉక్కునగరం: డీఎస్సీ–2025 ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన రెండో రోజు శుక్రవారం కొనసాగింది. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన 642 మంది అభ్యర్థులు ఉక్కునగరంలోని విశాఖ విమల విద్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. ఐదుగురు అభ్యర్థుల కుల ధృవీకరణ పత్రాల్లో తేడా ఉండటంతో ఒక రోజు గడువిచ్చారు. ఆర్‌జేడీ విజయభాస్కర్, స్టేట్ అబ్జర్వర్ దేవానంద రెడ్డి సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతున్న తీరును పరిశీలించారు.

75 మంది కార్యదర్శులకు బదిలీ

మహారాణిపేట: పంచాయతీరాజ్‌లో గ్రేడ్–6 సచివాలయ కార్యదర్శులకు గత రెండు రోజులుగా డీపీవో కార్యాలయంలో పదోన్నతులు, బదిలీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 75 మంది సచివాలయ కార్యదర్శులకు బదిలీ చేసినట్టు జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

నేడు జైల్‌కు దర్యాప్తు టీమ్

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో గతంలో పనిచేసిన సూపరింటెండెంట్, అడిషనల్ సూపరింటెండెంట్‌లపై దర్యాప్తు చేపట్టడానికి శనివారం ఇద్దరు అధికారుల గల బృందం రానుంది. జైళ్ల శాఖ గుంటూరు రేంజ్ డీఐజీ వరప్రసాద్, కడప కారాగారం సూపరింటెండెంట్ రాజేశ్వరరావు ఈ దర్యాప్తు చేపడుతున్నట్లు జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్ సాయిప్రవీణ్ తెలిపారు. గతంలో ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేసిన కిశోర్‌కుమార్, అడిషనల్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన వెంకటేశ్వరరావు సస్పెన్షన్‌లో ఉన్న విషయం తెలిసిందే. వారిపై ఈ దర్యాప్తు చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నారు.

ఏడో అదనపు జిల్లా కోర్టు ఏపీపీగా రాజశేఖర్



విశాఖ లీగల్ : నగరంలోని ఏడో అదనపు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది బట్టి రాజశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ న్యాయ వ్యవహారాల శాఖ కార్యదర్శి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ పదవిలో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు కొనసాగుతారు. రాజశేఖర్ ప్రస్తుతం పోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్నాడు.

జనసైనికుల ముష్టి యుద్ధం



ఎమ్మెల్యేల సమావేశ ప్రాంగణంలోనే కొట్లాట

- డిప్యూటీ సీఎం పవన్ ప్రొటోకాల్ చైర్మన్‌కు దేహశుద్ధి
- రూ.25 లక్షలకే ఫ్లాట్లు ఇస్తానని వసూలు
- వాటిని వేరొకరికి రిజిస్ట్రేషన్
- ఒక ఎమ్మెల్యే అనుచరుడి నుంచి చేబదులుగా రూ.40 లక్షలు
- డబ్బు ఇవ్వకుండా తిరుగుతున్న తిరుమలరావు
- జనసేన సమావేశ మందిరంలో అతడిని చితకబాదిన బాధితుడు

విశాఖ సిటీ: జనసైనికుల మధ్య జరిగిన ముష్టి యుద్ధం తీవ్ర చర్చనీయాంశమవుతోంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమావేశ సమయంలోనే ఇద్దరు జన సైనికులు పిడుగుద్దులు కురిపించుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. జనసేనాని పవన్ ప్రొటోకాల్ చైర్మన్‌పైనే తీవ్ర ఆరోపణలు ఆ పార్టీలో సెగలు పుట్టిస్తున్నాయి. తక్కువ ధరకే ఫ్లాట్ల విక్రయాల పేరుతో డబ్బు వసూలు చేసి వాటిని ఎక్కువ ధరకు వేరొకరికి అమ్మి సొమ్ముచేసుకున్నాడని పవన్ సన్నిహితుడిని సమావేశంలోనే చితకబాదిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జనసేన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని గురువారం బీచ్ రోడ్డులోని వైఎంసీఏ పక్కన ఉన్న ఒక హోటల్‌లో నిర్వహించారు.

దీనికి జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు హాజరయ్యారు. ఈ సమావేశం జరిగే హోటల్‌లోనే పవన్‌కల్యాణ్ ప్రొటోకాల్ చైర్మన్ మల్లినేడి తిరుమలరావు, కాకినాడ జిల్లాకు చెందిన జనసేన ఎమ్మెల్యే అనుచరుడు ప్రసాద్ మధ్య తీవ్ర స్థాయిలో కొట్లాట జరిగినట్లు సమాచారం.

రూ.కోట్లకు కుచ్చుటోపి

గత ఎన్నికలకు ముందు పవన్ కల్యాణ్ చేపట్టిన వారాహి యాత్రకు ప్రొటోకాల్ చైర్మన్‌గా బిల్డర్ అయిన మల్లినేడి తిరుమలరావు అలియాస్ బాబీకి బాధ్యతలు అప్పగించారు. ఆ యాత్ర తర్వాత అతడి పదవి, హోదాపై స్పష్టత లేనప్పటికీ.. ఇప్పటికీ పవన్ పర్యటన బాధ్యతలు తానే చూసుకుంటున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని పార్టీ శ్రేణులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే.. వృత్తిరీత్యా బిల్డర్ అయిన తిరుమలరావు భీమవరంలో వెంకటసాయి బిల్డర్స్ పేరుతో భారీ అపార్ట్‌మెంట్ నిర్మించి అనేక మందిని మోసం చేసినట్లు బాధితులు ఇప్పటికే కోర్టులో కేసులు సైతం వేశారు. **అపార్ట్‌మెంట్** నిర్మాణ సమయంలో ఒకేసారి క్యాష్ **ఇస్తే** రూ.25 లక్షలకే ఫ్లాట్ ఇస్తానని చెప్పి అనేక **మంది** నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపి**స్తున్నా**రు. ఇలా డబ్బు తీసుకున్న వారికి కాకుండా నిర్మాణం పూర్తయిన తర్వాత ఫ్లాట్లను అధిక ధరకు విక్రయించినట్లు చెబుతున్నారు. దీనిపై రూ.25 లక్షలు ఇచ్చిన వారు తిరుమలరావును ఏళ్లుగా అడుగుతున్నప్పటికీ.. పవన్ కల్యాణ్‌కు ఫండింగ్ చేశానని, ఆ డబ్బులు తిరిగి వచ్చిన వెంటనే ఇచ్చేస్తానని ఒకసారి, ఒక రిటైర్డ్ ఐపీఎస్ అధికారికి బినామీని అని త్వరలోనే అందరికీ ఇచ్చేస్తానని మరోసారి చెబుతూ తప్పించుకుని తిరుగుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కాకినాడ జిల్లాకు చెందిన జనసేన ఎమ్మెల్యే అనుచరుడు ప్రసాద్ అనే వ్యక్తి నుంచి చేబదులు కింద రూ.40 లక్షలు తీసుకుని రెండేళ్లుగా ఇవ్వకుండా తిప్పుతున్నట్లు సమాచారం.

సమావేశంలో చితక్కొట్టిన బాధితుడు

జనసేన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పవన్ కల్యాణ్ ప్రొటోకాల్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న తిరుమలరావును జనసేన ఎమ్మెల్యే అనుచరుడు ప్రసాద్ పట్టుకున్నాడు. తన డబ్బులు ఇవ్వకుండా తప్పించుకుని తిరగడంపై నిలదీశాడు. వారి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో తిరుమలరావును కోపంతో చితక్కొట్టేశాడు. ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతల సమక్షంలో తీవ్ర స్థాయిలో కొట్లాట జరిగింది. అందులో చాలా మంది తిరుమలరావు వ్యవహారం తెలియడంతో వారు కల్పించుకోలేదు. కొంతమంది మాత్రం వ్యక్తిగత వ్యవహారాలు బయట చూసుకోవాలని సమావేశంలో కాదని వారిని వారించే ప్రయత్నం చేశారు. దీనిపై ప్రసాద్ మండిపడుతూ పవన్ కల్యాణ్‌కు ప్రొటోకాల్ చైర్మన్ అని చెప్పుకుంటున్న తిరుమలరావు పార్టీ సభ్యుడు కాదా? అని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేసిన వ్యక్తికి కీలకమైన బాధ్యతలు ఎలా అప్పగిస్తారని ప్రశ్నించడంతో ఎవరూ నోరెత్తలేకపోయారు. ప్రసాద్ తనను తీవ్రంగా కొట్టినట్లు తిరుమలరావు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించినట్లు సమాచారం. అయితే తిరుమలరావు వ్యవహార శైలి తెలిసిన ఎమ్మెల్యేలు ఆ కేసు తీసుకోవద్దని పోలీసులకు చెప్పినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని జనసేన అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లాలని బాధితులు భావిస్తున్నారు. అయితే ఇప్పటికే తిరుమలరావు వ్యవహారం పవన్‌కు తెలిసినప్పటికీ.. ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని వారు వాపోతున్నట్లు పార్టీలో చర్చ జరుగుతోంది.

జనసేనలో అసంతృప్తి జ్వాలలు

- పార్టీ నేతలకు, కార్యకర్తలకు విలువ లేదని ఆవేదన
- ఎమ్మెల్యేలు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆక్రోశం
- ఎన్నికల్లో కష్టపడినా తమకు గుర్తింపు లేదని మండిపాటు
- వారిని బుజ్జగించడానికి కిందా మీదా పడిన పవన్ కల్యాణ్



విశాఖ సిటీ : జనసేన అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో అసంతృప్తి జ్వాలలు పెల్లుబికాయి. కూటమి ప్రభుత్వంలో తమకు విలువ లేకుండా పోయిందని పార్టీ నేతలు ఆక్రోశం వెళ్లగక్కారు. ఎమ్మెల్యేలు, అధికారులు తమను కనీసం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రాణాలకు తెగించి పార్టీ కోసం పనిచేస్తే.. అధికారంలోకి వచ్చాక పక్కనపెట్టేశారని అధినేతనే నిలదీశారు. తమకు పదవులే కాదు.. కనీసం గుర్తింపు కూడా లేదని వాపోయారు. వారిని సముదాయించడానికి పవన్ కల్యాణ్ కిందా మీదా పడాల్సి వచ్చింది. జనసేన ప్లీనరీ సందర్భంగా రెండు రోజులుగా విశాఖలో పార్టీ ఎమ్మెల్యేలు, నేతలతో పవన్ కల్యాణ్ వరుస సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలతో కూడా భేటీ అయ్యారు. ఇందులో నేతలు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వంలో తమ పరిస్థితులను, కష్టాలను అధినేత దృష్టికి తీసుకువెళ్లారు.

జనసైనికులు, వీర మహిళలే పార్టీకి బలం

జనసేన పార్టీ సైద్ధాంతిక భావజాలాన్ని నమ్మిన జనసైనికులు, వీర మహిళలే పార్టీకి బలమని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు ఇచ్చే బలంతోనే జనసేన జాతీయ పార్టీ స్థాయికి ఎదిగేలా పనిచేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా, సిద్ధాంతాన్ని నమ్మే సమూహం కావాలని పిలుపునిచ్చారు. సినిమా అభిమాన బలాన్ని రాజకీయంగా వ్యవస్థీకృతం చేయాలి. ఎవరో ఒకరికి బాధ్యత అప్పగించడం తన ఉద్దేశం కాదని, పార్టీని సంస్థాగతంగా ఎందుకు బలోపేతం చేయలేకపోతున్నామని చాలా మంది అడుగుతున్నారన్నారు. కానీ జనసేనను భుజాన వేసుకుంటూ మోస్తున్నది జనసైనికులు, వీరమహిళలే అన్నారు. కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు.

కూటమిలో విలువ లేదు..

కూటమి ప్రభుత్వంలో జనసేన నేతలు, కార్యకర్తలకు కనీసం విలువ లేకుండా చేస్తున్నారని కొందరు అధినేతకు ఫిర్యాదులు చేశారు. ముఖ్యంగా జనసేన ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే వారి స్వప్రయోజనాలు చూసుకుంటున్నారని, తమను కనీసం పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇక టీడీపీ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో అధికారులు సైతం తమకు విలువ ఇవ్వడం లేదని ఆవేదన చెందారు. పార్టీ కోసం కష్టపడితే ఇప్పటి వరకు పదవులు లేవని, గుర్తింపు కూడా లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. మరికొందరు మాత్రం కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఎక్కువవుతోందని, దీని నుంచి బయట పడే విషయంపై పార్టీ పెద్దలు దృష్టిసారించాలని సూచించినట్లు తెలిసింది. రాష్ట్రంలో పార్టీ ఇంకా ఎదగాలని, ప్రస్తుతం ప్రభుత్వంపై వ్యతిరేకత కారణంగా ఆ ప్రభావం పార్టీపై కూడా పడుతోందని, ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ఇబ్బందికర పరిస్థితులు వచ్చే ప్రమాదముందని హెచ్చరించినట్లు సమాచారం. అసంతృప్తితో ఉన్న నేతలు, కార్యకర్తలకు అధినేత పవన్ సర్దిచెప్పడానికి తీవ్రంగా కష్టపడాల్సి వచ్చింది.

డబుల్ డెక్కర్ బస్సుల ప్రారంభం



డబుల్ డెక్కర్ బస్సులను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

ఏయూక్యాంపస్ : బీచ్‌రోడ్డులో శుక్రవారం హాప్ ఆన్–హాప్ ఆఫ్ డబుల్ డెక్కర్ ఎలక్ట్రికల్ బస్సులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మంత్రులు, ప్రజా ప్రతినిధులతో కలిసి కొద్ది దూరం ప్రయాణించారు. ఆర్కే బీచ్ నుంచి తొట్లకొండ వరకు దాదాపు 16 కిలోమీటర్ల మేర పర్యాటక ప్రాంతాల్లో ఈ బస్సులు తిరుగుతాయి. నగరానికి వచ్చే పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించే విధంగా బస్సు ప్రయాణం ఉంటుందన్నారు. ఈ బస్సుల్లో ప్రాథమికంగా 24 గంటల ప్రయాణానికి రూ.500 ఉండగా టికెట్ చార్జీలో సగం మొత్తాన్ని ప్రభుత్వం భరించనుందన్నారు. విశాఖ ఆర్థిక రాజధానిగా, ఆసియా టెక్నాలజీ హబ్‌గా ఎదుగుతోందన్నారు. విశాఖలో డేటా సెంటర్, సీ కేబుల్ ఏర్పాటు అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీబాల వీరాంజనేయ స్వామి, హోం మంత్రి అనిత, టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ శ్రీ భరత్, స్పెషల్ చీఫ్‌సెక్రటరీ అజయ్ జైన్, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్, కలెక్టర్ ఎం.ఎన్ హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు షర్టుకు హాప్ ఆన్–హాప్ ఆఫ్ బ్యాడ్జిని జీవీఎంసీ కమిషనర్ కేతన్ అతికించారు.

ఏ సమస్య అయినా ఏఐతో పరిష్కారం

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్
- చంద్రంపాలెం హైస్కూల్‌లో ఏఐ ల్యాబ్ ప్రారంభించిన మంత్రి



ప్రాజెక్టులు తయారు చేసిన విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి లోకేష్

మధురవాడ: విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శుక్రవారం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైయేంట్ లిమిటెడ్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏఐ అన్ని సమస్యలకు పరిష్కారం చూపిస్తుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సాంకేతిక పరిజ్ఞానం జీవితంలో తీసుకువచ్చే మార్పుల గురించి వివరించారు. ఏఐ, స్టెమ్, రోబోటిక్స్ టూల్స్‌తో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ఆయన పరిశీలించి, అభినందించారు. ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థినులు అరుణశ్రీ, భాగ్యలక్ష్మిలు రూపొందించిన 'స్మార్ట్ ఫార్మింగ్' ప్రాజెక్టును ఆసక్తిగా తిలకించారు. పాఠశాల మైదానం బురదమయంగా ఉండడం గతంలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. 24 గంటల్లోగా ఈ సమస్యలపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇదిలావుండగా పాఠశాల ప్రాంగణంలో టీడీపీ జెండాలు, రాజకీయ కార్యకలాపాలు నిర్వహించడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. టీడీపీ కార్పొరేటర్లను లోపలికి వెళ్లనీయకుండా సెక్యూరిటీ బైటకి తోసేయడంతో వారంతా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో గంటా శ్రీనివాసరావు కొద్దిసేపటి తర్వాత వచ్చి కార్పొరేటర్లను లోపలికి తీసుకు వెళ్లారు. కార్యక్రమంలో మంత్రులు అనిత, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు చిరంజీవిరావు, గాదె శ్రీనువాసులు నాయుడు, ఆర్‌జేడీ విజయభాస్కర్, డీఈవో ప్రేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ సర్వీస్ పోర్టల్ ప్రారంభం



పోర్టల్‌ను ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత, రీజనల్ ఫైర్ ఆఫీసర్ నిరంజన్‌రెడ్డి

అల్లిపురం: నవరించిన అగ్నిమాపక సేవల శాఖ వెబ్‌సైట్, ఆన్‌లైన్ ఫైర్ సర్వీస్ (ఎన్‌ఓసీ) పోర్టల్‌ను హోం మంత్రి అనిత ప్రారంభించారు. ఎంవీపీ కాలనీలోని హెచ్‌హెచ్‌ఎం బేస్ క్యాంపులో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, కొత్త పోర్టల్ పౌరులకు చాలా సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఇకపై పౌరులు ప్రొవిజనల్, ఆక్యుపెన్సీ, పునరుద్ధరణ (రిన్యూవల్), ఎన్‌ఓసీల కోసం అగ్నిమాపక శాఖ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి వివరించారు. ఈ సర్టిఫికెట్లు ఏపీ ఫైర్ యాక్ట్ 1999, ఏపీ బిల్డింగ్ రూల్స్ 2017, నేషనల్ బిల్డింగ్ కోడ్ ఆఫ్ ఇండియా (ఎన్‌బీసీ 2016) ప్రకారం స్వయంచాలకంగా జారీ అవుతాయన్నారు. అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ పి. వెంకట రమణను ఆమె అభినందించారు. కార్యక్రమంలో ప్రాంతీయ అగ్నిమాపక అధికారి డి. నిరంజన్ రెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అయిపోయిన పెళ్లికి బాజాలు

- వైఎస్సార్ సీపీ హయాంలో యాత్రీ నివాస్ నిర్మాణం
- ఎన్నికల సమయానికే 85 శాతం పనులు పూర్తి
- కూటమిలో నెమ్మదించిన పనులు
- ఇటీవలే నిర్మాణం పూర్తి.. బుకింగ్‌లు కూడా ప్రారంభం
- నేడు పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ప్రారంభానికి హడావుడి



విశాఖ సిటీ : కూటమి ప్రభుత్వంలో ప్రారంభోత్సవాలన్నీ అయిపోయిన పెళ్లికి బాజాలు అన్నట్లే ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులన్నింటినీ కూటమి ప్రభుత్వమే చేపట్టినట్లు కలరింగ్ ఇస్తోంది. నెలల క్రితం కార్యకలాపాలు ప్రారంభించిన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాల పేరిట హడావుడి చేస్తుండడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. తాజాగా బీచ్ రోడ్డులో లుంబినీ పార్క్ ఎదురుగా పర్యాటక శాఖకు చెందిన యాత్రీ నివాస్ ప్రారంభోత్సవంలోను అదే పరిస్థితి కనిపిస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.12.3 కోట్లతో యాత్రీ నివాస్ భవన నిర్మాణాలు చేపట్టగా అప్పట్లో 85 శాతం పనులు పూర్తయ్యాయి. దేశ విదేశీ పర్యాటకులకు వారి అభిరుచులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలతో నిర్మాణాలు ఎన్నికల సమయానికే దాదాపుగా తుది దశకు చేరుకున్నాయి. స్టార్ హోటల్స్‌కు దీటుగా చేపట్టిన భవన నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వం వచ్చాక నెమ్మదించాయి. మొత్తం 4 అంతస్తుల భవనంలో 46 గదులు, రెస్టారెంట్ ఉన్న ఈ పర్యాటక హోటల్‌ను ప్రైవేటుకు ఇచ్చేందుకు ఇప్పటికే టెండర్లు సైతం ఆహ్వానించారు.

బుకింగ్‌లు మొదలయ్యాక ప్రారంభోత్సవమంట..

యాత్రీ నివాస్‌లో 42 ఏసీ గదులు ఉన్నాయి. వీటిని ఏసీ సూట్, ఏసీ డీలక్స్, ఏసీ ఎగ్జిక్యూటివ్ రూమ్‌లుగా విభజించారు. ఇందులో ఇప్పటికే బుకింగ్‌లు కూడా ప్రారంభించారు. ఇద్దరు టూరిస్టులకు ఏసీ సూట్ రూమ్ డిమాండ్‌ను బట్టి రూ.3,750 నుంచి రూ.4,200, ఏసీ డీలక్స్ రూ.4,625 నుంచి రూ.5,180 వరకూ, ఏసీ ఎగ్జిక్యూటివ్ రూమ్‌కి రూ.3,125 నుంచి రూ.3,500(ట్యాక్స్ అదనం) వరకూ వసూలు చేస్తున్నారు. రూమ్‌లతో పాటు అత్యాధునిక వసతులతో రెస్టారెంట్, బార్, వెయిటింగ్ హాల్, కాన్ఫరెన్స్ హాల్ మొదలైనవి అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఎక్కువగా పశ్చిమ బెంగాల్, ఒడిశాతో పాటు ఉత్తరభారత దేశానికి చెందిన పర్యాటకులు బస చేస్తున్నారు. బుకింగ్ ప్రారంభించిన వారాల తర్వాత ఇప్పుడు ఈ హోటల్‌ను ప్రారంభించడానికి రాష్ట్ర పర్యాటక శాఖ కందుల దుర్గేష్ వస్తున్నారు. శనివారం ఆయన చేతుల మీదుగా యాత్రీ నివాస్ ప్రారంభోత్సవానికి హడావుడి చేస్తున్నారు. అయిపోయిన పెళ్లికి బాజాలు అన్నట్లు.. బుకింగ్‌లు ప్రారంభమయ్యాక కూడా మంత్రి దుర్గేష్ ప్రారంభోత్సవానికి రావడం పట్ల పర్యాటక శాఖలో సిబ్బందే విస్తుపోతున్నారు.

57 బార్లకే దరఖాస్తులు

- జిల్లాకు 121 బార్లు కేటాయింపు. గీత కులాలకు మరో 10
- వాటిలో 57 బార్లకే నాలుగేసి చొప్పున దరఖాస్తుల రాక
- నేడు వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో లాటరీ

విశాఖ సిటీ: అనుకున్నట్లే జరిగింది. జీవీఎంసీ పరిధిలో సగం బార్లకు కూడా దరఖాస్తులు రాలేదు. కేవలం 57 బార్లకే నాలుగేసి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. కూటమి ప్రభుత్వం కొత్త బార్ పాలసీ ప్రకారం విశాఖ జిల్లాలో జనరల్‌కు 121 బార్లు, గీత కులాలకు మరో 10 బార్లు కేటాయించింది. ముందుగా ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానించగా కేవలం 44 బార్లకు మాత్రమే వచ్చాయి. దీంతో ప్రభుత్వం శుక్రవారం వరకు గడువు పొడిగించింది. అయినప్పటికీ ఆశించిన స్థాయి స్పందన లేదు. మొత్తంగా 57 బార్లకు నాలుగేసి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. మిగిలిన వాటికి రాలేదు. అయితే గీత కులాలకు కేటాయించిన పది బార్లకు పూర్తిస్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. జనరల్‌లో 57 బార్లకు, గీత కులాలకు సంబంధించి 10 బార్లకు శనివారం ఉదయం లాటరీ తీయనున్నారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ఉదయం 8 గంటలకు కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆధ్వర్యంలో లాటరీ జరగనుంది. దరఖాస్తుదారులు 7.30 గంటలకే చిల్డ్రన్స్ థియేటర్‌కు హాజరుకావాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ప్రసాద్ సూచించారు.

కూత ఉత్కంఠగా..



ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వైభవ్ సూర్యవంశీ, పుల్లెల గోపీచంద్, ధన్‌రాజ్ పిళ్లై



విశాఖ స్పోర్ట్స్: విశాఖ పోర్టులో శుక్రవారం రాత్రి ప్రో కబడ్డీ లీగ్ 12వ సీజన్ ఆరంభమైంది. అభిమానుల కోలాహలం, సందడి వాతావరణం మధ్య జరిగిన తొలి మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 38–35 తేడాతో తెలుగు టైటాన్స్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. చివరివరకు ఉత్కంఠగా సాగిన ఈ పోరులో ఇరు జట్లు నువ్వానేనా అన్నట్టుగా తలపడ్డాయి. ప్రోకబడ్డీ లీగ్ 12వ సీజన్‌ను తమిళ్ తలైవాస్ జట్టు విజయంతో ప్రారంభించింది. మ్యాచ్ ఆఖరి క్షణంలో తలైవాస్ కెప్టెన్ పవన్ సెహ్రావత్ తన మాజీ జట్టుపై చేసిన సూపర్ రైడ్తో విజయం సాధించారు. ఒక దశలో టైటాన్స్ 27–20 ఆధిక్యంతో విజయం సాధించేలా కనిపించినా, చివరిలో తడబడింది. తలైవాస్ తరఫున స్టార్ రైడర్ అర్జున్ దేశ్వాల్ 12 పాయింట్లతో సూపర్ టెన్ సాధించాడు. తెలుగు టైటాన్స్ జట్టులో ఆల్‌రౌండర్ భరత్ 11 పాయింట్లతో రాణించినా ఫలితం దక్కలేదు. కెప్టెన్ విజయ్ మాలిక్ 6 పాయింట్లు, డిఫెండర్ శుభం షిండే 4 పాయింట్లు సాధించారు. ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు జరిగిన జాతీయగీతాలాపన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, ఐపీఎల్ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, హాకీ ఆటగాడు ధన్‌రాజ్ పిళ్లై తదితరులు పాల్గొన్నారు. శనివారం తెలుగు టైటాన్స్ జట్టు యూపీ యోధాస్‌తో తలపడనుంది. శనివారం జరిగే మ్యాచ్‌ల్లో యూపీ యోధాస్‌తో తెలుగు టైటాన్స్ తలపడనుండగా మరో పోటీలో యు ముంబా జట్టుతో గుజరాత్ టైటాన్స్ తలపడనుంది. మరో మ్యాచ్‌లో బెంగళూర్ బుల్స్ జట్టుపై పునేరి పాల్టన్ జట్టు విజయం సాధించింది.

కీచక లెక్చరర్‌కు రిమాండ్



శ్రీధర్

పరవాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న గుత్తుల శ్రీధర్(56) కళాశాలలో ఇంటర్ సెకండియర్ విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జున రావు తెలిపారు. ఈ నెల 23న మధ్యాహ్నం కెమిస్ట్రీ లెక్చరర్ శ్రీధర్ సైన్స్ ల్యాబ్‌కు విద్యార్థినిని పిలిపించి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. బాధిత విద్యార్థిని ఫిర్యాదు, విద్యార్థినుల వాగ్మూలం ఆధారంగా లెక్చరర్‌పై 24న కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు. అనంతరం అనకాపల్లి అడిషినల్ మున్సిఫ్ కోర్టులో హాజరు పర్చగా ప్రధాన న్యాయమూర్తి వచ్చే నెల 12 వరకు రిమాండ్ విధించగా..అనకాపల్లి సబ్ జైలుకు తరలించినట్లు సీఐ వెల్లడించారు. కేసును పరవాడ మహిళా ఎస్‌ఐ జీవీఎస్ మహాలక్ష్మి దర్యాప్తు చేశారు.

స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ

సీతంపేట: గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు గృహిణి స్పోకెన్ ఇంగ్లిష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దామోదర మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. రామాటాకీస్ సమీపంలో కెనరా బ్యాంకు ఎదురుగా శ్రీకృష్ణా ట్రావెల్స్ మేడపైన ఉన్న సంస్థ కార్యాలయంలో సెప్టెంబరు 1 నుంచి అక్టోబరు 31 వరకు ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 80193 88999 ఫోన్ నంబరుకు సంప్రదించాలని కోరారు.

వారు మరణించి.. కొందరికి వెలుగునిచ్చి

- పెందుర్తి ప్రాంతంలో వివిధ కారణాలతో ముగ్గురి మృతి
- వారి నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులు



అప్పలనర్సమ్మ, అప్పారావు, అరుణకుమారి (ఫైల్)

పెందుర్తి: పుట్టెడు దుఃఖంలోనూ పలు కుటుంబాలు మానవత్వం చాటుకున్నాయి. పెందుర్తిలోని సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ చొరవతో కొందరి జీవితాలకు వెలుగురానుంది. పెందుర్తి, చినముషిడివాడ, చింతలగ్రహారం ప్రాంతాల్లో వివిధ కారణాలతో మృతి చెందిన వారి నేత్రాలను ఆయా కుటుంబాలు దానం చేశాయి. వివరాలివి..

చినముషిడివాడలో..

స్థానిక శతాబ్దినగర్‌లో నివాసం ఉంటున్న అడబాల అప్పలనర్సమ్మ(65) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మరణించింది. విషయం తెలుసుకున్న ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీనివాస్ అక్కడకు చేరుకుని స్థానికులు మెంటి మహేష్, చిట్టిబోయిన గౌరి చొరవతో నేత్ర దానం కోసం కుటుంబ సభ్యులను ఒప్పించారు. దీంతో అప్పలనర్సమ్మ కుమారులు అడబాల ఎర్రినాయుడు, సత్యనారాయణ అంగీకారం తెలిపారు.

చింతలగ్రహారంలో..

గ్రామంలో నివాసం ఉంటున్న ఆడారి అప్పారావు(50) ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాస్ మృతుని బంధువు భీశెట్టి శంకర్ చొరవతో కుటుంబ సభ్యులను నేత్రదానానికి ప్రతిపాదించగా.. అప్పారావు భార్య ఆడారి సూర్యకాంతం, కుమారులు శంకర్, రాము, కుమార్తెలు నాగమణి, వెన్నెల జ్యోతి ఆమోదించారు.

ప్రశాంతినగర్‌లో..

కాలనీలో నివాసం ఉంటున్న కందాల అరుణకుమారి(56) అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న సాయి ట్రస్ట్ ప్రతినిధులు నేత్రాదానానికి ఒప్పించగా.. భర్త బుచ్చి రమణ, కుమారుడు సాయిభరత్‌కుమార్ అంగీకారం తెలిపారు. ఆయా మృతుల నేత్రా(కార్నియా)లను మొహిషిన్ ఐ బ్యాంక్ ప్రతినిధి మనోజ్ సేకరించారు. ఆయా కుటుంబాల మానవత్వానికి స్థానికంగా ప్రశంసలు వెల్లువెత్తాయి.

బస్సులపై భారం.. ప్రాణాలతో చెలగాటం

- నాల్గో పట్టణ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆర్టీసీ బస్సు దగ్ధం
- తప్పిన ఘోర ప్రమాదం.. ప్రయాణికులంతా సురక్షితం
- బస్సులో పరిమితికి మించి ప్రయాణికులు



దగ్ధమైన బస్సు

తాటిచెట్లపాలెం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్త్రీ శక్తి' పథకం ప్రయాణికుల భద్రతకు ముప్పుగా మారింది. శుక్రవారం విశాఖలో జరిగిన బస్సు ప్రమాదం.. ఈ ఆందోళనను మరింత పెంచింది. ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో సాధారణ ప్రయాణికులతో పాటు ఉచిత ప్రయాణం చేస్తున్న మహిళలు అధిక సంఖ్యలో ఉన్నారు. దీంతో బస్సుల సామర్థ్యానికి మించి ప్రయాణికులు కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. ఈ పరిస్థితి బస్సుల నిర్వహణపై తీవ్రమైన ఒత్తిడిని పెంచుతోంది. తగినన్ని బస్సులను నడపకుండా, ఉన్న బస్సులపైనే భారం మోపడం వల్ల, అవి త్వరగా పాడైపోతున్నాయి. సరైన నిర్వహణ లేకపోవడం, అధిక భారం వల్ల ఇంజిన్‌లు వేడెక్కడం వంటి సమస్యలు తలెత్తి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. విశాఖలో బస్సు దగ్ధమైన ఘటన ప్రజలను భయాందోళనకు గురిచేసింది. అదృష్టవశాత్తూ, ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణనష్టం జరగలేదు. కానీ ఈ సంఘటన ఉచిత బస్సు ప్రయాణంపై ప్రజలు, ముఖ్యంగా మహిళలు పునరాలోచించుకునేలా చేసింది.

క్షణాల్లో అగ్నికీలలు.. బస్సు దగ్ధం

ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై విశాఖ-విజయనగరం మెట్రో బస్సులో శుక్రవారం పొగలు వచ్చాయి. ఆటో డ్రైవర్.. కండక్టర్‌కు సమాచారం ఇవ్వడంతో డ్రైవర్ అప్రమత్తమయ్యాడు. దీంతో ప్రయాణికులందరూ తక్షణమే బస్సులో నుంచి దిగిపోయారు. కొన్ని క్షణాల్లోనే బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ప్రమాదాలకు కారణం.. అధికారుల నిర్లక్ష్యం?

సామర్థ్యానికి మించి ప్రయాణించడం, బస్సుపై అధిక ఒత్తిడి పడటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని నిపుణులు చెబుతున్నారు. ఉచిత బస్సు పథకం ప్రారంభించినప్పటి నుంచి అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించకపోతే ఇలాంటి ప్రమాదాలు పునరావృతమవుతాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదం జరిగినప్పుడు అక్కడే ఉన్నా..

ఆ సమయంలో ఇక్కడే విధి నిర్వహణలో ఉన్నాను. అకస్మాత్తుగా బస్సులో నుండి పొగలు, మంటలు రావడంతో వెంటనే అగ్ని మాపక సిబ్బందికి, ఉన్నతాధికారులకు సమాచారం అందించాను. ప్రయాణికులందర్నీ దూరంగా వెళ్లిపోవాలని ఆదేశించాను. ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారు.

– బంగారుబాబు, ఫోర్త్‌టౌన్ ట్రాఫిక్ కానిస్టేబుల్

వివాహ విషయాన్ని దాచిపెట్టిన వ్యక్తికి మూడేళ్ల జైలు

విశాఖ లీగల్ : తన మొదటి వివాహాన్ని దాచిపెట్టి రెండో పెళ్లి చేసుకున్న ఒక వ్యక్తికి మూడేళ్లు కఠిన కారాగార శిక్ష విధిస్తూ నగరంలోని ఒకటో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పి. ప్రదీప్ శుక్రవారం తీర్పు చెప్పారు. జైలు శిక్షతో పాటు రూ. 20,000 జరిమానా కూడా చెల్లించాలని, లేకపోతే అదనంగా ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో స్పష్టం చేశారు. పెందుర్తికి చెందిన ఎల్లంకి అప్పల రామ్మూర్తి, 2010కి ముందు పెళ్లి చేసుకున్నాడు. ఆ వివాహాన్ని దాచిపెట్టి, 2010 మార్చి 10న పెందుర్తి చెందిన వై. వెంకటలక్ష్మిని రెండో వివాహం చేసుకున్నాడు. పెళ్లి సమయంలో వెంకటలక్ష్మి కుటుంబ సభ్యులు రామ్మూర్తికి భారీ మొత్తంలో కట్నం, ఇతర సామగ్రిని అందజేశారు. అయితే రామ్మూర్తి మొదటి వివాహం విషయం తెలిసి, వెంకటలక్ష్మికి జరిగిన అన్యాయంపై పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ కృష్ణకుమారి కేసును దర్యాప్తు చేసి, నిందితుడిపై భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 495 (మొదటి వివాహం విషయం దాచిపెట్టి మరో వివాహం చేసుకోవడం), సెక్షన్ 417 (మోసం చేయడం) కింద కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో పై విధంగా న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఈ రెండు శిక్షలు ఏకకాలంలో అమలు కావాలని కూడా న్యాయమూర్తి పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. విమల రాథోర్ కేసు వివరాలను సమర్పించారు.

పలు రైళ్ల రద్దు, మరికొన్ని రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధి విజయనగరం వద్ద శుక్రవారం ఉదయం గూడ్స్ రైలు బోగీలు పట్టాలు తప్పడంతో విశాఖ నుంచి బయల్దేరాల్సిన పలు రైళ్లు రద్దు చేశారు. వాల్తేర్ డీఆర్‌ఎం సంఘటన స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులను పూర్తిచేయించారు. సాయంత్రానికి ఇరు వైపులా ట్రాక్‌లపై రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. విజయనగరం-విశాఖపట్నం(67288) పాసింజర్, విశాఖపట్నం-పలాస-విశాఖపట్నం(67289/67290)పాసింజర్, విశాఖపట్నం-కోరాపుట్(58538) పాసింజర్, విశాఖపట్నం-బ్రహ్మపూర్(58532)పాసింజర్, బ్రహ్మపూర్-విశాఖపట్నం(18525)ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-విజయనగరం(67287)పాసింజర్, విశాఖపట్నం-దుర్గ్(18530)ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-దుర్గ్(22820) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం రద్దు చేశారు. 30వ తేదీన కోరాపుట్-విశాఖపట్నం(58537) పాసింజర్, బ్రహ్మపూర్-విశాఖపట్నం(58531) పాసింజర్ రద్దు చేశారు. ఈ లైన్‌లో పలు రైళ్లను రీ షెడ్యూల్ చేశారు.

మహిళా క్రికెట్ జట్టుతో లోకేష్ చిట్‌చాట్



భారత మహిళా క్రికెటర్లతో మంత్రి లోకేష్

విశాఖ స్పోర్ట్స్: మహిళల ప్రపంచకప్‌లో పాల్గొనే భారత మహిళా క్రికెట్ జట్టు విశాఖ వేదికగా శిక్షణా శిబిరంలో పాల్గొంటుంది. శుక్రవారం మంత్రి నారా లోకేష్ జట్టు సభ్యులతో చిట్‌చాట్ చేశారు. ఉమ్మడి ఏపీ అంతర్జాతీయ పోటీలకు వేదికగా నిలిచిందన్నారు. క్రీడల్ని ప్రోత్సహించేందుకు మూడు శాతం స్పోర్ట్స్ కోటా అమలు చేస్తున్నామని ఈ సందర్భంగా క్రీడాకారిణులతో అన్నారు. జట్టు సభ్యులకు శుభాకాంక్షలందించారు. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ మాట్లాడుతూ క్రీడల్లో భారతీయ మహిళల సత్తా ఏంటో ప్రపంచానికి చాటిచెప్పాలన్నారు.

గెలవాలనే పట్టుదల ఉండాలి : మంత్రి లోకేష్

విశాఖ స్పోర్ట్స్ : విజయం అంత సులభంగా రాదని, గెలుపుపై పట్టుదల, అవంతరాలను ఎదుర్కొనే తపనతోనే విజయం సాధ్యమని యువ క్రీడాకారులకు మంత్రి నారా లోకేష్ సూచించారు. విశాఖలోని ఏయూ కన్వెన్షన్‌లో జరిగిన జాతీయ క్రీడా దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ఆధునిక పిల్లలు ఎక్కువగా ఆన్‌లైన్ ఆటలకే పరిమితమై, శారీరక శ్రమను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వపరంగా క్రీడలను ప్రోత్సహించి, ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ క్రీడా రాజధానిగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మంగళగిరిలో 45 పార్కులు నిర్మించామని, ఇది సామాజిక సమగ్రతకు దారితీస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బ్యాడ్మింటన్ కోచ్ గోపీచంద్, క్రికెటర్ ఎం.ఎస్.కే. ప్రసాద్, చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి తదితర అంతర్జాతీయ క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. గోపీచంద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. హంపి తన కష్టాలను గుర్తు చేసుకుని, పట్టుదలతో తిరిగి విజయం సాధించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్, ఎంపీ శ్రీభరత్, మంత్రులు అనిత, బాలవీరాంజనేయస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన డ్రైవర్లు, కండక్టర్లకు మెరిట్ సర్టిఫికెట్లు



మెరిట్ సర్టిఫికెట్ అందిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సింహాచలం: ఆంధ్రప్రదేశ్‌లో 'స్త్రీశక్తి' పథకం ఎటువంటి సమస్యలు లేకుండా విజయవంతంగా కొనసాగుతోందని, ఈ విజయం ఏపీఎస్ఆర్టీసీ యాజమాన్యానిది, కార్మికులది అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండలిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. సింహాచలంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శుక్రవారం సీసీ కెమెరాలు, తాగునీటి శుద్ధి పరికరాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. అనంతరం జిల్లాలోని అన్ని డిపోల నుంచి ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లకు మంత్రి మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసి విజయనగరం ఈడీ కె.బ్రహ్మానందరెడ్డి, విశాఖ రీజినల్ మేనేజర్ అప్పలనాయుడు, సింహాచలం డిపో మేనేజర్ శరత్‌బాబు, చీఫ్ ఇన్‌స్పెక్టర్ రమణమూర్తి పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం.. ఆరుగురి అరెస్టు

డుంబ్రిగుడ (అల్లూరి సీతారామరాజు): మండలంలోని జైపూర్ జంక్షన్ వద్ద శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో రెండు బైక్‌లపై వస్తున్న ఆరుగురి నుంచి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ కె.పాపినాయుడు తెలిపారు. బైక్‌లపై వస్తున్న అరకులోయ మండలం చినలబుడు పంచాయతీ మాలివలసకు చెందిన వంతాల పూర్ణ(33), వంతాల జగత్‌రాయ్(20), విశాఖనగరంలోని అల్లిపురం, వెంకటేశ్వరమెట్టకు చెందిన పాట్టి హేమంత్‌కుమార్, అల్లిపురం కొత్తమ్మవారి గుడి ప్రాంతానికి చెందిన బొమ్మిడి ప్రవీణ్‌కుమార్ (23), లోగేష్ సతీష్ (21), అల్లిపురంలోని వివేకానంద కాలనీకి చెందిన బైరెడ్డి సతీష్ (23) బ్యాగ్‌లను తనిఖీ చేయగా గంజాయి పట్టుబడిందన్నారు. ఈ మేరకు వీరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు. నిందితుల నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని ఆయన వివరించారు.

నెలవారీ అద్దెకు సమావేశ మందిరాలు

ఏయూక్యాంపస్ : బీచ్‌రోడ్డును ఆనుకుని ఉన్న యూత్ హాస్టల్ భవనంలో సమావేశ మందిరాలను నెలవారీ అద్దెకు ఇవ్వనున్నట్లు పరిపాలనాధికారి మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వర రావు తెలిపారు. హాస్టల్ ప్రాంగణంలో ఉన్న చిన్న, పెద్ద సమావేశ మందిరాలను సాంస్కృతిక, శిక్షణ కార్యక్రమాలకు మాత్రమే అద్దెకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు పెద్దహాలు నెలకు రూ.9 వేలు, చిన్న హాలు రూ.6 వేలకు అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8074605109 నంబరులో సంప్రదించాలని సూచించారు.

యుద్ధవిమాన మ్యూజియంలోకి ప్రవేశం లేదు

ఏయూక్యాంపస్: వార్షిక నిర్వహణ మరమ్మతుల నేపథ్యంలో సెప్టెంబర్ 1, 2 తేదీల్లో బీచ్‌రోడ్డులోని టీయూ-142 యుద్ధ విమాన మ్యూజియం ప్రవేశాలను నిలిపివేస్తున్నట్లు వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. సెప్టెంబర్ 3వ తేదీ నుంచి మ్యూజియంలో యథావిధిగా సందర్శకులకు ప్రవేశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

మండపాల వద్ద జాగ్రత్తలు తప్పనిసరి

విశాఖ సిటీ: వినాయక చవితి మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యుత్‌శాఖ అధికారులను, సిబ్బందిని ఆదేశించినట్లు ఏపీఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్‌ఈ జి.శ్యాంబాబు తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఆదేశాల మేరకు ప్రజలకు, భక్తులకు, మండప నిర్వాహకులకు విద్యుత్ భద్రతా సూచనలు అందజేస్తున్నామని చెప్పారు. విద్యుత్ శాఖ పేర్కొన్న సూచనలను పాటించాలన్నారు.

దత్తు పార్థివ దేహం ఏఎంసీకి అప్పగింత

మహారాణిపేట: నగరంలో ఫొటోగ్రఫీకి మార్గదర్శకుడిగా నిలిచిన పబ్బిశెట్టి దత్తాత్ రేయుడు (దత్తు) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, బుధవారం ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థివ దేహాన్ని శుక్రవారం ఆయన కుటుంబసభ్యులు విశాఖలోని ఆంధ్రా మెడికల్ కాలేజీ (ఏఎంసీ)లోని అనాటమీ విభాగానికి దానం చేశారు. దత్తు బ్లాక్ అండ్ వైట్ ఫిల్మ్ ఫొటోగ్రఫీ నుంచి డిజిటల్ ఫొటోగ్రఫీ వరకు ఆరు దశాబ్దాలకు పైగా ఆ రంగంలో విశేష కృషి చేశారు. 1959లో నౌకాదళంలో సివిల్ సర్వీస్ ఉద్యోగిగా పనిచేస్తున్నప్పటికీ, ఫొటోగ్రఫీపై ఉన్న మక్కువతో ఈ రంగాన్ని ఎంచుకొని అంచెలంచెలుగా ఎదిగారు. విశాఖలో కలర్ ఫొటోగ్రఫీని పరిచయం చేసిన మొదటివారిలో ఆయన ఒకరు. ఆయనమృతి తీరని లోటని సహచరులు పేర్కొన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా గోలి శ్రీనివాస్

విశాఖ లీగల్ : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది గోలి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో శ్రీనివాస్ జిల్లా, రాష్ట్ర లీగల్ ప్రతినిధిగా, జిల్లా కోశాధికారిగా, జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షుడిగా, స్టేట్ కౌన్సిల్ సభ్యుడిగా సేవలందించారు. తనను ఈ పదవికి నియమించినందుకు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజుకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆదివారం పనిచేయనున్న విద్యుత్ బిల్లు వసూలు కేంద్రాలు

విశాఖ సిటీ : జిల్లాలోని ఏపీఈపీడీసీఎల్ రెవెన్యూ కార్యాలయాల్లో విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు 31వ తేదీన (ఆదివారం) కూడా పనిచేస్తాయని ఎస్‌ఈ జి.శ్యాంబాబు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు, ఉప విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు, రాజీవ్ ఈపీడీసీఎల్ కౌంటర్లు, ఏటీపీ సెంటర్లలో ఆదివారం విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని సూచించారు. అదే విధంగా ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్, ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్ ద్వారా కూడా బిల్లులు చెల్లించవచ్చన్నారు.

రేంజ్ పరిధిలో 12 మంది సీఐల బదిలీ

సాక్షి, విశాఖపట్నం: విశాఖ రేంజ్ పరిధిలో 12 మంది ఇన్‌స్పెక్టర్లకు బదిలీలయ్యాయి. వీఆర్‌లో ఉన్న సవరపు రమేష్‌ను విశాఖ సీఎస్‌పీఎస్‌కు, అల్లూరి జిల్లా కొయ్యూరు సర్కిల్ సీఐగా ఉన్న పి.వెంకట రమణను అదే జిల్లాలో సోషల్‌మీడియా సైబర్ సెల్‌కు, విజయనగరం సోషల్ మీడియా సెల్ సీఐగా ఉన్న బమ్మిడి శ్రీనివాసరావును కొయ్యూరు సర్కిల్ సీఐగా బదిలీ చేశారు. అదేవిధంగా రేంజ్ పరిధిలో వీఆర్‌లో ఉన్న ఆర్.నీలయ్యను పార్వతీపురం మన్యం వీఆర్‌కు, ఆర్.సత్యనారాయణ రెడ్డిని విజయనగరం వీఆర్‌కు, లెంకా భాస్కర్‌రావును శ్రీకాకుళం వీఆర్‌కు, విజయనగరం వీఆర్‌లో ఉన్న బీవీ వెంకటేశ్వర రావును విశాఖ రేంజ్ వీఆర్‌కు, విజయనగరం టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసే బంగారు పాపను విశాఖ రేంజ్ వీఆర్‌కు, విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉన్న ఎం.చంద్రశేఖర్‌ను విజయనగరం టాస్క్‌ఫోర్సుకు బదిలీ చేశారు. ఈ మేరకు శుక్రవారం విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ ఉత్తర్వులు జారీ చేశారు.

నలుగురు సీఐలకు స్థానచలనం

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో నలుగురు ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో గాజువాక ట్రాఫిక్ సీఐగా ఉన్న పి.కోటేశ్వరరావును సీటీసీకి, పీసీఆర్‌లో ఉన్న ఎస్.కె.హుస్సేన్‌ను గాజువాక ట్రాఫిక్‌కు, సీటీసీ నుంచి ఎల్.సన్యాసినాయుడును గోపాలపట్నం లా అండ్ ఆర్డర్‌కు, అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఎస్.వి.ప్రభాకర్‌రావును పీసీఆర్‌కు బదిలీ చేశారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు నేటి వరకు గడువు

ఆరిలోవ : ఆర్టీఈ చట్టం కింద ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాల కోసం ఆదివారం వరకు గడువు ఉన్నట్లు సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త జె.చంద్రశేఖరరావు తెలిపారు. జిల్లాలో 1,784 మంది విద్యార్థులను లాటరీ ద్వారా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఎంపికై ఇంతవరకు పాఠశాలల్లో చేరకుంటే.. అలాంటివారికి ఈనెల 30 వరకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. అలాంటి విద్యార్థుల తల్లిదండ్రులు సంబంధిత పాఠశాలను సంప్రదించి ప్రవేశం ఖరారు చేసుకోవాలని సూచించారు.